**కథ**

# హాస్పిటల్‌లో ఒక రోజు

ఉదయం ఎనిమిది గంటలవుతోంది. సావిత్రమ్మ వంటింట్లో హడావిడిగా వుంది. అందరికీ టిఫిన్లూ, కాఫీలు అందించేసరికి యీ టైమైంది. ఆయనకు ఆఫీసుకు భోజనం తయారు చేస్తోంది. పిల్లలు కూడా స్కూలుకి వెళ్లటానికి తయారవుతున్నారు.

ఈరోజు అత్తగార్ని ఆసుపత్రికి తీసుకెళ్లాలి. తనకు తీరిక చిక్కటం లేదు. పెద్ద కొడుకు నానీని పిలిచి అత్తగార్ని ఆసుపత్రికి తీసుకెళ్లమంది.

‘‘నాకు కాలేజీ టయిమవుతోందే, ఎలా?’’ అన్నాడు వాడు.

‘‘ఎలా ఏంట్రా? ఇంట్లో పని వదిలి నేను వెడితే ఎలా కుదురుతుంది? పనులన్నీ అయాక వెడితే యింకక్కడ తెల్లారినట్టే. ప్రతీ చోటా చాంతాడంత క్యూలు. మెడికల్ కార్డూ, డబ్బులూ టేబిల్ మీద పెట్టాను. నాన్నమ్మను జాగ్రత్తగా తీసుకెళ్లి మందులిప్పించి జాగ్రత్తగా తీసుకురా. ఇప్పుడెడితే త్వరగా వచ్చెయ్యొచ్చు’’ తన బాధంతా వెళ్లగక్కుతూ ఫైనల్ డెసిషన్ యిచ్చింది సావిత్రమ్మ కొడుక్కి.

‘‘సరేలే! ఏదైనా చెప్పాల్సి వస్తే గంట చెబుతావు’’ అని విసుక్కుంటూ ‘‘రావే నాన్నమ్మా’’ అని పిలిచాడు నాని. అప్పటికే ఆ నాన్నమ్మ గుమ్మం దగ్గర రెడీగా వుంది.

★ ★ ★

ప్రతి జబ్బుకీ ప్రత్యేక డాక్టర్లు తయారవుతున్న రోజులు. ప్రయివేటు రంగంలోనే కాక, ప్రభుత్వ రంగ ఆసుపత్రులలో కూడా సూపర్ స్పెషాలిటి సబ్జెక్ట్స్ ప్రవేశపెడుతున్న రోజులివి. డాక్టర్లు కూడా చాలా ఆత్రుతగా ఏదో గొప్ప గొప్ప వైద్యాలు చేయాలని కుతూహలపడుతున్న రోజులివి.

ఆ కేంద్ర ప్రభుత్వ రంగ ఆసుపత్రిలో కూడా సూపర్ స్పెషాలిటీ డాక్టర్లున్నారు. అయితే అది ప్రభుత్వ ఆసుపత్రి కాబట్టీ అందునా ఒక కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్‌ది కాబట్టీ అక్కడ ఆ విభాగానికి చెందిన వారిని, వారి కుటుంబ సభ్యులను మాత్రమే చూస్తారు. అయినా అక్కడ కూడా మిగతా గవర్నమెంటు ఆసుపత్రుల లాగా చాంతాడంత క్యూలూ, పెలుసుతనం, అలసత్వం వగైరా కొన్ని స్పెషాలిటీస్ కూడా అక్కడ కొంతమంది సిబ్బందిలో వుండడం సహజాతి సహజం.

నానీ, నాన్నమ్మా ఇద్దరూ ఆసుపత్రికి వచ్చేసరికి చీటీలు రాసే చోట చాలామంది జనమే వున్నారు. ఆడవాళ్లకూ, మగవాళ్లకూ విడివిడిగా క్యూలున్నాయి. నానీ మెడికార్డ్ పట్టుకుని క్యూలో నిలబడ్డాడు. నానీ వాళ్ల నాయన ఆ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తాడు. అందుకని అతనికి అతని కుటుంబ సభ్యులందరికీ వైద్యం అందుబాటులో వుండేందుకు వాళ్ల డిపార్ట్‌మెంట్ అతనికొక మెడికల్ కార్డ్ యిచ్చింది. అతనికి తండ్రి చనిపోయాడు కాబట్టి విధవ తల్లికి ఆ ఆసుపత్రిలో మందులు తీసుకునే అర్హత వుంది. ఆ కార్డు పట్టుకునే నానీ క్యూలో నిలబడ్డాడు.

రెండు క్యూలూ మెల్లగా జరుగుతున్నాయి. నాన్నమ్మ కొంచెం దూరంగా వున్న బల్లమీద కూర్చుంది. ఇంతలో ఆడవాళ్ల క్యూలో గొడవ మొదలైంది. ఒకామె కౌంటర్ క్లర్క్‌ని బ్రతిమాలుతోంది చీటీ రాసివ్వమని. అతను మెడికల్ కార్డ్ అడుగుతున్నాడు. ఆమె కంగారులో తీసుకురాలేదని చెప్పింది. కార్డు లేకుండా చీటీ యివ్వనంటున్నాడు అతను. ఆమె గోలపెడుతోంది. ‘‘కడుపు నొప్పి భరించలేకుండా వున్నాను బాబూ! ఆ బాధతో వచ్చేటప్పుడు కార్డు తేవటం మర్చిపోయాను. బాబ్బాబు, నీకు దణ్ణం పెడతాను. చీటీ యియ్యి. నొప్పి భరించలేకుండా వున్నాను’’ అని గోలపెడుతోంది.

కార్డు లేకుండా యివ్వనంటున్నాడు అతను. ఆమె చీటీ యిమ్మని గోల. కాస్సేపు వాళ్లిద్దరి మధ్యా జరుగుతున్న గొడవ విని జనం విసుక్కోవటం మొదలుపెట్టారు. కొంతమంది కౌంటర్ క్లర్క్ మీద కేకలేశారు. కొంత మంది ఆడాళ్లు ఆమెను తిట్టారు కార్డు లేకుండా ఎలా వచ్చావని.

ఎలా అయితేనేం కాస్సేపటికి పక్క కౌంటర్ వాడి సలహా మీద ఆమెకు చీటీ రాసిచ్చాడు కౌంటర్ క్లర్క్.

కాస్సేపటికి మగాళ్ల క్యూలో నానీ వంతువచ్చింది. ‘ఎవరికి చీటీ’ అని అడిగాడు రెండో కౌంటర్ క్లర్క్. వాళ్ల నాన్నమ్మ పేరు చెప్పాడు నానీ. ఆడవాళ్లకయితే ఆ కౌంటర్‌లో చీటీ తీసుకోవాలన్నాడు రెండో క్లర్క్. మా నాన్నమ్మకే కానీ, ఆవిడ నిలబడలేదు. అందుకే నేను క్యూలో నిలబడ్డాను. చీటీ యివ్వండి అన్నాడు నానీ.

‘‘ఇది మగాళ్ల కౌంటర్. ఇక్కడ మగాళ్లకే చీటీ యిస్తాం. ఆడవాళ్లకు కాదు. మీ నాన్నమ్మగారికి కావాలంటే పక్క కౌంటర్‌లో తీసుకో’’ అన్నాడు రెండో కౌంటర్ క్లర్క్.

‘‘అదెలాగయ్యా! అది ఆడవాళ్ల క్యూ! నేనెలా అందులో నిలబడతాను. ఇది మగాళ్ల క్యూ కాబట్టి యిక్కడ నిలబడ్డాను. చీటీ ఎవరి పేర మీదనైతేనేం నేను మగాడ్ని కాబట్టి యీ క్యూలో....’’

‘‘అయ్యన్నీ నాకు తెలవదు. మీ నాన్నమ్మ ఆడది కాబట్టి ఆ కౌంటర్‌లోనే చీటీ తీసుకోవాలె, అంతే’’ అన్నాడు మొండిగా రెండో కౌంటరు క్లర్క్.

కొంతసేపు తర్జనభర్జన తరువాత పక్క కౌంటర్‌వాడి సలహామీద నానీకి చీటి రాసిచ్చాడు. విసుక్కుంటూ ఆ చీటీ తీసుకుని బయటకొచ్చాడు నానీ. వాళ్ల నాన్నమ్మ దగ్గరకు వెళ్లి ఆమెను తీసుకుని డాక్టర్లున్న రూములవైపు బయలుదేరాడు. అక్కడ ప్రతి రూమ్ ముందు పెద్ద పెద్ద క్యూలున్నాయి. జనరల్ డాక్టర్స్ రూము ముందయితే ఇంక చెప్పక్కర్లేదు.

వాళ్ల నాన్నమ్మని క్యూలో కుదేసి తను తెచ్చుకున్న పుస్తకం పట్టుకుని కూర్చున్నాడు నానిబాబు. చాలాసేపటి తర్వాత డాక్టరు రూములోకి వెళ్లింది నానమ్మ. అక్కడ నలుగురు డాక్టర్లు రోగులందర్నీ క్షుణ్ణంగా పరీక్షించి కొంతమందికి మందులు రాస్తున్నారు. కొంతమందిని వేరే డాక్టర్ల దగ్గరకెళ్లమని వాళ్లుండే రూం నెంబరు రాస్తున్నారు. అలా రాయించుకుని బయటకు వచ్చింది నానమ్మ.

‘‘ఏమన్నారే?’’ అన్నాడు నానిబాబు నానమ్మతో.

‘‘పన్నెండో నెంబరు రూముకెళ్లాలటరా?’’

అక్కణ్ణించి ఇద్దరూ బయలుదేరారు. అక్కడ కూడా క్యూ చాలా పెద్దదిగానే వుంది. మళ్లీ ఆవిడ్నక్కడ క్యూలో నిలబెట్టి తను దూరంగా వున్న బెంచీమీద కూర్చున్నాడు.

అరగంట తర్వాత లోపలికి వెళ్లింది నానమ్మ. కొంచెం విశాలంగానే వుంది. ఇద్దరు డాక్టర్లు కాస్త ఎడం ఎడంగా కూర్చున్నారు. ఇద్దరి ముందూ టేబుల్స్ ఉన్నాయి. కొంత హాస్పిటల్ ఎక్విప్‌మెంట్ ఉంది. టేబుల్ పక్కగా వున్న స్టూలుమీద కూర్చుంది నానమ్మ.


ఆవిడ జబ్బేమిటో అడగలేదు డాక్టరు. ఆమె కూర్చోగానే ముందు నాడి పరీక్షించారు. తర్వాత స్టెతస్కోపుతో ఆమె గుండె, వీపూ, పక్కలా పరీక్షించాడు. కనురెప్పలు బాగా తెరిచి చూశాడు. మోకాళ్లమీద కొట్టి చూశాడు. ఆమెకు విసుగొచ్చింది. అసహనంగా స్టూలుమీద కదిలింది.

‘‘నాకు చెవిలో భయంకరమైన నొప్పి బాబూ!’’ అంది.

‘‘అందుకేగా పరీక్షిస్తున్నాను. తొందరపడతారేం. ఆగండి. పరీక్ష చేస్తున్నానుగా’’ అన్నాడు డాక్టర్ అంతే అసహనంతో. మాట్లాడకుండా కూర్చుంది ఆవిడ.

ఆమెను పక్కకు తిరగమని ఆవిడ చెవి ఒక చేత్తో పట్టుకుని మరో చేత్తో ఆవిడ చెవిలో టార్చి వేసి చూస్తున్నాడు. తరువాత తాపీగా తెచ్చిన చీటీ తీసుకుని రాయబోయాడు.

‘‘నాకు ఎడమ చెవిలో నొప్పి బాబు.



**అరగంట తర్వాత లోపలికి వెళ్లింది నానమ్మ. కొంచెం విశాలంగానే వుంది. ఇద్దరు డాక్టర్లు కాస్త ఎడం ఎడంగా కూర్చు న్నారు. ఇద్దరి ముందూ టేబుల్స్ ఉన్నాయి. కొంత హాస్పిటల్ ఎక్విప్‌మెంట్ ఉంది. టేబుల్ పక్కగా వున్న స్టూలుమీద కూర్చుంది నానమ్మ. ఆవిడ జబ్బేమిటో అడగలేదు డాక్టరు. ఆమె కూర్చోగానే ముందు నాడి పరీక్షించారు. తర్వాత స్టెతస్కోపుతో ఆమె గుండె, వీపూ, పక్కలా పరీక్షించాడు. కనురె ప్పలు బాగా తెరిచి చూశాడు. మోకాళ్లమీద కొట్టి చూశాడు. ఆమెకు విసుగొచ్చింది. అస హనంగా స్టూలుమీద కదిలింది.**

మీరు కుడి చెవి పరీక్ష చేశారు. ఎడమ చెవి చెయ్యరా?'' అంది ఎంతో ఓపిగ్గా.

''మీరా మాట ముందే చెప్పొచ్చుగా? పరీక్షలన్నీ అయ్యాక ఇప్పుడు చెబుతారేం? ఏమిటో ఈ పేషెంట్స్. ఏదీ సరిగ్గా చెప్పి చావరు'' అని విసుక్కున్నాడు. ''చూడండీ నేను కుడి చెవి స్పెషలిస్టుని. ఎడం చెవి చూడ్డానికి వేరే డాక్టరున్నాడు. అదిగో ఆ డాక్టర్‌గారు. అక్కడికెళ్లండి'' అని విసరుగా ఆ చీటీ ఆవిడ చేతిలో పెట్టి 'నెక్స్‌ట్' అన్నాడు.

ఆవిడ పక్క డాక్టర్‌గారి దగ్గరకెళ్లింది. ఆయన మళ్లీ అన్నీ పరీక్షలు చేసి ఆవిడ ఎడం చెవిలో లైటువేసి చూసి అప్పుడు ఆవిడ తెచ్చిన చీటీలో వివరాలు రాసి మందులు రాసాడు. రెండు పేజీలు నిండిపోయాయి.

''ఇవి ఎలా వాడాలో కాంపౌండర్ చెబుతాడు. ఈ మందులు ఐదురోజులు వాడండి. నొప్పి తగ్గుతుంది'' అని చెప్పాడు.

కాళ్ళీడ్చుకుంటూ బయటకొచ్చింది ఆవిడ. అప్పటికే కాలేజీ టైము బాగా దాటిపోయిందని విసుక్కుంటున్నాడు నానిబాబు.

''ఏమైందే?'' అన్నాడు.

''మందులు రాసిచ్చాడురా!''

''ఏదీ ఆ చీటీ ఇలాతే'' అని అడిగి పుచ్చుకుని మందులిచ్చే వైపు బయలుదేరుతూ చీటీ చదవసాగాడు. అందులో దాదాపు పన్నెండు మందులు వరకూ రాసు న్నాయి. వెళ్లి క్యూలో నిలుచున్నాడు. చాంతాండంత పొడు గుంది మగాళ్ల క్యూ. ఆడవాళ్ల క్యూ కొంచెం తక్కువగా వుంది. తను నిలబడితే లాభం లేదని వాళ్ల నానమ్మని ఆడ వాళ్ల క్యూలో నిలబెట్టాడు. కౌంటర్ దగ్గరున్న వాళ్లు కాంపౌండర్‌తో గొడవ పడుతున్నారు.

డాక్టర్లు రాసిన అన్ని మందులులేవని ఏదో ఒకటి రెండు మందులిస్తున్నారు వాళ్లు. అన్ని మందులు ఇవ్వడం లేదనీ పేషెంట్ల గోల. డాక్టర్లు రాసిన మందులన్నీ లేవని కాంపౌండర్ల గోల.

ఈ గోల మధ్య కిటికీ దగ్గరకు చేరుకుంది నానమ్మ. ఆమె చేతిలో చీటీ తీసుకున్నాడు కాంపౌండర్. చీటీ వంక ఎగాదిగా చూశాడు. అన్ని మందులు రాసిన ఆ చీటీ తెచ్చిన ఆ నానమ్మను చూస్తే అతనికి జాలేసింది.

''మీకు బాధేమిటమ్మా?'' అన్నాడు కాంపౌండర్.

''చెవిలో నొప్పి బాబూ, ఎడం చెవిలో.''

''నెప్పి ఏ చెవిలో అయినా ఒకటేలెండి. ఈ వయ సులో చెవి నొప్పికి ఇన్ని మందులు వాడితే మీరు తట్టుకోగ లరా? నేనో మాట చెబుతాను కోప్పడరుకదా'' అన్నాడు అనుభవజ్ఞుడయిన ఆ పెద్ద కాంపౌండర్.

''చెప్పు బాబూ''

''ఇందులో రాసిన మందుల్లో చెవి డ్రాప్స్ ఉన్నాయి. అవి ఇస్తాను. ఉదయం, సాయంత్రం ఒక్కొక్క డ్రాప్ చెవిలో వెయ్యండి. రెండు మూడు రోజుల్లో తగ్గిపోతుంది. మిగతా మందులు అనవసరం. ఏమంటారు?'' అన్నాడు.

''అలాగే'' అని చెవి డ్రాప్స్ తీసుకుని బయటకొచ్చిం దావిడ.

ఆవిడ చేతిలో మందుసీసా తీసుకుని ఇంటికి బయ లుదేరాడు నాని వాళ్ల నానమ్మతో. రిక్షా ఎక్కేముందు ఆ మందు ఖరీదు చూసాడు నాని. నాలుగు రూపాయల ఎనభై పైసలుంది. రానుపోను రిక్షాకి వాళ్లిద్దరికీ పదిహేను రూపాయలయ్యింది. ఎంత దండగ! ఇంటి దగ్గర మందుల షాపువాడ్ని అడిగితే ఇలాంటివే ఏమైనా డ్రాప్స్ ఇచ్చేవాడేమో!

''ఏం స్పెషాలిటీస్‌రా బాబూ'' అనుకుంటూ రిక్షా ఎక్కాడు వాళ్ల నానమ్మతో. ★

**హేమలత ఎమ్. పటేల్**